సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గీసుగొండ, మే 11: మండలంలోని కొనాయిమాకుల రైతు వేదికలో ఆదివారం గీసుగొండ, సంగెం, గ్రేటర్ వరంగల్ 15, 16, 17వ డివిజన్లకు చెందిన అర్హులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పంపిణీ చేశారు. గీసుగొండ మండలానికి చెందిన 116 మందికి రూ. 40.13 లక్షలు, సంగెం మండలానికి చెందిన 116 మందికి రూ. 41,65,500, 17వ డివిజన్‌కు చెందిన 13 మందికి రూ. 4,37,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డీటీ రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రుద్ర ప్రసాద్, బదావత్ నర్సింహానాయక్, నాయకులు శ్రీనివాస్, మాధవరెడ్డి, సౌజన్య, కొమురారెడ్డి, బిక్కిరెడ్డి సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆసరవెల్లి జీపీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని ధర్నా

నల్లబెల్లి, మే 11: రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ గ్రామస్తులు జీపీ కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా చేశారు. మండలంలోని ఏజెన్సీ గ్రామమైన ఆసరవెల్లిలో 263 నివాస గృహాలు, 756 జనాభా, 160 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతినెలా రేషన్ బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు అష్టకష్టాలు పడుతూ నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న మేడెపల్లి శివారు లక్ష్మీతండాకు వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఆసరవెల్లిని గ్రామ పంచాయతీగా గుర్తించింది. అయినప్పటికీ అధికారులు గ్రామంలో రేషన్‌షాపు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నాలో జక్కుల సారమ్మ, తడుక కోమల, ఈర్ల కోమల, విజయమ్మ, సమ్మక్క, రేణుక, మంజుల, గుండోబోయిన సాంబయ్య, బాలాజీ బాలు, ధరావత్ పరంసింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

నర్సంపేట, మే 11: కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పంజాల వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి అందజేశారు. ఉద్యమకారులకు రూ. 25 వేల పెన్షన్‌తోపాటు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చి ఇల్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతి లక్ష్మీనారాయణ, తౌటు రమేశ్, శ్రీధర్‌రావు, జిల్లా బాధ్యులు సంగెం మహేందర్, ఏరుకొండ సదానందం, మండల బాధ్యులు కొర్ర గవర్‌సింగ్, జన్ను రవి, సుధాకర్ పాల్గొన్నారు.

కట్టయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు

బొమ్మల కట్టయ్య సేవలు మరువలేనివి

కరీమాబాద్, మే 11: దళితరత్న బొమ్మల కట్టయ్య సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. బొమ్మల అంబేద్కర్ ఆధ్వర్యంలో కరీమాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం బొమ్మల కట్టయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కట్టయ్య లేనిలోటు తీరనిదన్నారు. కట్టయ్యతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం బొమ్మల కట్టయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవి, తరాల రాజమణి, నీలం మల్లేశం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న సచిన్ నింబాల్కర్ వీర్‌చక్ర

ఎన్‌సీసీ క్యాంపులో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట, మే 11: ఎన్‌సీసీ తెలంగాణ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో మండలంలోని లక్నేపల్లి శివారు బాలాజీ టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చారు. 41 మంది విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొని డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, లీడర్షిప్, మోటివేషన్, ఆక్టివిటీస్, కల్చరల్ ఆక్టివిటీస్, స్పోర్ట్స్ అంశాల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. వీరు ఎన్‌సీసీ వరంగల్ గ్రూప్ కమాండర్ సచిన్ నింబాల్కర్ వీర్‌చక్ర చేతులమీదుగా సర్టిఫికెట్లు అందుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ రియాజొద్దీన్, రవీందర్‌రెడ్డి, శ్రీను, యాకూబ్‌రెడ్డి పాల్గొన్నారు.

చేనేత ఐక్య వేదిక రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కమలాకర్

పోచమ్మమైదాన్, మే 11: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కొత్తవాడకు చెందిన మంత్రి కమలాకర్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చేనేత కార్మికుల సమస్యలపై ఉన్న అవగాహనతో వారి సంక్షేమం కోసం కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చేనేత కార్మికులకు అందాల్సిన పథకాలపై ఎప్పటికప్పుడు వారికి సమాచారం అందిస్తూ, రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ముచ్చింపుల ఊరచెరువులో వేతనాలు ఇవ్వాలని కోరుతున్న ఉపాధి కూలీలు

ఊతమివ్వని ఉపాధి పనులు

- తప్పడు కొలతలు వేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్
- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు.. ఉపాధి కూలీల ఇబ్బందులు

నల్లబెల్లి, మే 11: గ్రామీణులకు ఏటా వంద రోజులపాటు పనులు కల్పించాలనే సంకల్పంతో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పనులు ఊతమివ్వడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ముచ్చింపుల ఊరచెరువులో సుమారు 100 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ప్రతి కూలీకీ అదే రోజు చేసిన పనిని కొలతలు వేసి డబ్బులకు సంబంధించిన రసీదు ఇవ్వాల్సి ఉంది. కానీ, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహర్తిస్తూ పని జరిగిన చోట కూలీలు లేకుండానే తప్పుడు కొలతలు వేయడంతోపాటు రిసిప్ట్‌లు ఇవ్వడం లేదని బాధిత కూలీలు తాళ్లపల్లి అనిల్, సమ్మయ్య, పులి సరోజనతోపాటు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలతో దురుసుగా ప్రవర్తిస్తూ తాము చేసిన పనికి తగిన కూలీ రాకుండా అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దీంతో 100 మంది కూలీలు 8 రోజుల వేతనాలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పని ప్రదేశంలో నీటివసతితో పాటు నీడకోసం టెంట్లు ఏర్పాటు చేయడం లేదని, ఫస్ట్ ఎయిడ్ ఆరోగ్య కిట్లు సైతం ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. ఈ విషయమై ఏపీవో వెంకటనారాయణను వివరణ కోరగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని, కూలీలకు న్యాయం చేస్తామని తెలిపారు.

13న పాలీసెట్

- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించం
- జిల్లా కో ఆర్డినేటర్ ప్రభాకర్

హనుమకొండచౌరస్తా, మే 11: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో మూడు సంవత్సరాల ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం జరిగే పాలీసెట్-2025ను ఈ నెల 13న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని 12 కేంద్రాల్లో 6424 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 10 గంటల నుంచే అనుమతిస్తారని, విద్యార్థులు తమ వెంట హెచ్‌బీ, 2బీ బ్లాక్ పెన్సిల్, ఎరేసర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ తీసుకొని రావాలని, 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే పాస్ పోర్టు సైజు ఫొటో, ఐడీ ప్రూఫ్(ఆధార్ కార్డు) తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

నర్సంపేటలో ఒకరి అదృశ్యం

నర్సంపేట, మే11: నర్సంపేటలో ఒకరు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని మాదన్నపేట రోడ్డుకు చెందిన షేక్ సలీం స్థానికంగా మేస్త్రీ పని చేస్తున్నాడు. ఈ నెల 10న ఉదయం కుటుంబ సభ్యులతో పని ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. అప్పటి నుంచి సలీం ఇంటికి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా లభించలేదు. సలీం కుమారుడు షేక్ షారూఖ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

అసాంఘిక శక్తులకు అడ్డా

- కొత్తవాడలో నెలల తరబడి పార్కింగ్ చేసి ఉన్న వాహనాలు
- వెహికిల్స్ మధ్యలో మద్యం తాగుతున్న ఆకతాయిలు
- ఇబ్బందులు పడుతున్న స్థానిక మహిళలు

కొత్తవాడలో రోడ్డుపై నెలల తరబడి పార్కింగ్ చేసిన గుర్తు తెలియని వాహనాలు, సర్కిల్‌లో ఉన్న బీరు సీసాలు

పోచమ్మమైదాన్, మే 11: వరంగల్ కొత్తవాడలో అసాంఘిక శక్తుల బెడద రోజురోజుకూ పెరిగిపోతున్నదని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఏకశిలా కళాశాల వెనక వీధుల్లో అసాంఘిక కార్యక్రమాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో నెలల తరబడి గుర్తుతెలియని వాహనాలను పార్కింగ్ చేసి వదిలేయడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. దీంతో కొందరు యువకులు మద్యం సేవిస్తూ, ధూమపానం, గంజాయి తాగుతూ రోడ్డుపై వెళ్లే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ నెలల తరబడి పార్కింగ్ చేసిన రెండు వాహనాల మధ్య అడ్డా ఏర్పాటు చేసుకుని ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. అమ్మాయిలు, అబ్బాయిలు ఇక్కడకు చేరుకుని అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఆకతాయిల ఆగడాలకు ఈ రోడ్డుపై నడవాలంటే పిల్లలు, మహిళలు జంకుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆకతాయిలు, స్థానికులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు ఈ ప్రాంతంలో నిత్యం పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తూ ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, నెలల తరబడి ఉంటున్న గుర్తు తెలియని వాహనాలను ఇక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు.

బల్దియా గ్రీవెన్స్ రద్దు

వరంగల్, మే 11: మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతో గ్రీవెన్స్ నిర్వహించడం లేదని తెలిపారు. నగర ప్రజలు వినతులు, ఫిర్యాదులు ఇవ్వడానికి బల్దియా కార్యాలయానికి రావొద్దని ఆమె సూచించారు.

యువకుడి ఆత్మహత్య

అజయ్ (ఫైల్)

నెక్కొండ, మే 11: ఇంట్లో తనకు స్వేచ్ఛ లేదని, చిన్నచిన్న విషయాలకే తనను తాతయ్య, నానమ్మ మందలిస్తున్నారని మనోవేదనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గొల్లపల్లిలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. భట్టు అజయ్(21) తల్లి చిన్నతనంలోనే మరణించడంతో గ్రామానికి చెందిన తాతయ్య, నానమ్మ వద్ద పెరిగాడు. శనివారం సాయంత్రం అజయ్ ఇంటికి చేరుకోగా, ఎక్కడ తిరిగొచ్చావని వారు మందలించారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అజయ్ ఇంట్లోకి వెళ్లి చీరెతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అక్క భట్టు శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలసంస్కార్‌తో విద్యార్థుల్లో నైతిక విలువల పెంపు

తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

పర్వతగిరి, మే 11: బాలసంస్కార్ కార్యక్రమంతో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని ప్రవచనకర్త సౌమిత్రి లక్ష్మణాచార్యులు అన్నారు. మండలంలోని కల్లెడ శ్రీకొలను వేంకటేశ్వరస్వామి దేవాలయ సన్నిధిలో 15 రోజులుగా నిర్వహిస్తున్న బాల సంస్కార్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు బాల సంస్కార్ కార్యక్రమాన్ని పర్వతగిరి శ్రీరామ కృష్ణ సేవా సమితి, సహృదయ సేవా సమితి, కల్లెడ కొలను వేంకటేశ్వరస్వామి సేవా బృందం, ఆలయ నిర్వాహక బృందం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు త్రికరణశుద్ధిని పెంపొందించుకొని, అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. దేశభక్తి, ఏకాగ్రతను పెంపొందించుకునేలా తల్లిదండ్రులు తమవంతు బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు నీతి కథలతోపాటు దేశభక్తి నినాదాలను చేయించారు. వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావు మాట్లాడుతూ మొక్కై వంగనిది మానై వంగునా అని అన్నారు. అనంతరం విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదాభివందనం చేయించారు. కార్యక్రమంలో ఆర్డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, శ్రీరామకృష్ణ సేవా సమితి బాధ్యులు చింతపట్ల సురేందర్‌రావు, చిదురాల వేణుగోపాల్, జూపూడి రఘు, సహృదయ సేవా సమితి సభ్యులు రాణాప్రతాప్, అనిల్, వినీత్, కొలను వేంకటేశ్వరస్వామి నిర్వాహక బృందం సభ్యుడు అజయ్, పర్వతగిరి శ్రీరామకృష్ణ సేవా సమితి సభ్యులు వడ్లకొండ దయాకర్, సారంగపాణి, భాస్కర్, చిదురాల చంద్రశేఖర్, ప్రేమ్, జంగ ప్రసాద్, విష్ణు, దేవేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి జయంతి

పూజలు చేస్తున్న భక్తులు

వర్ధన్నపేట, మే 11: మండలంలోని ఇల్లంద గ్రామంలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఉదయం ఆలయంలో సుమారు 4 గంటలపాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు భక్తులకు ఆశీర్వచనాలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

కల్యాణికి డాక్టరేట్

సంగెం, మే 11: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వాసం కల్యాణి ఎకనామిక్స్‌లో డాక్టరేట్ అందుకున్నారు. 'తెలంగాణలో సుస్థిర వ్యవసాయం అవకాశాలు, సవాళ్లు' అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనా గ్రంథానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ సావిత్రి పర్యవేక్షణలో కల్యాణి తన పరిశోధన పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన కల్యాణి డాక్టరేట్ అందుకోవడంపై గ్రామస్తులు అభినందించారు.

ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలి

గిర్మాజీపేట, మే 11: జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్, ఇంగ్లిష్, సోషల్ టీచర్లకు మొదటి దశలో ఈ నెల 13 నుంచి 17 వరకు, రెండో దశలో మండల రిసోర్స్ పర్సన్స్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లకు ఈ నెల 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ ఆదేశించారు. ఉదయం 9 గంటలకు హాజరు కావాలని, శిక్షణార్థులకు జియో టాగింగ్ విధానం ద్వారా ఆన్‌లైన్ అటెండెన్స్ ఉంటుందని తెలిపారు. శిక్షణకు ఒకరోజు గైర్హాజరు అయినా అటెండెన్స్ సర్టిఫికెట్ జనరేట్ కాదని, గైర్హాజరుకు ఎలాంటి వెసులుబాటు ఉండదని డీఈవో హెచ్చరించారు.

ట్రాక్టర్ డబ్బా మీదపడి ఒకరికి తీవ్ర గాయాలు

ఖానాపురం, మే 11: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డబ్బా మీద పడడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కొత్తూరులో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ధర్మారావుపేటకు చెందిన పోతరాజు మోహన్ తన ట్రాక్టర్‌తో కొత్తూరు శివారులో పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డబ్బా పైప్ పగిలిపోవడంతో డబ్బాను జాకీతో పైకిలేపి పైపును సరిచేస్తున్నారు. ఈ క్రమంలో పైప్ పగిలిపోవడంతో ఒక్కసారిగా డబ్బా కింద పడింది. దీంతో మోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.

ఉత్సవాలు ప్రారంభం

వర్ధన్నపేట/ఖానాపురం, మే 11: గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబాదేవి ఉత్సవాలు వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద, ఖానాపురం మండలకేంద్రంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గౌడ కులస్తులు జలబిందెలతో గ్రామం నుంచి ఆకేరు వాగు ఒడ్డున ఉన్న శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయానికి డప్పుచప్పుళ్ల మధ్య చేరుకొని స్వామివారికి, అమ్మవార్లకు జలంతో అభిషేకం చేశారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేయడంతోపాటు స్వామి వారికి నివేదనలు సమర్పించారు.

ఎట్టకేలకు ధాన్యం దిగుమతి

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

రాజుపేటలోని హరి ఇండస్ట్రీస్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి

ఖానాపురం, మే 11: ఎట్టకేలకు మండలంలోని బాలుతండాకు చెందిన ఐదుగురి రైతుల ధాన్యాన్ని దిగుమతి చేసుకున్నారు. రైతుల సమస్యలపై ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణి, డీసీవో కిష్టయ్య, క్వాలిటీ కంట్రోలర్ రాజయ్య, స్థానిక ఏవో బోగ శ్రీనివాస్, సివిల్ సప్లయ్ డీటీ సంధ్యారాణి ఆదివారం నర్సంపేట మండలం రాజుపేటలోని హరి ఇండస్ట్రీస్‌ను సందర్శించారు. లారీలోని ధాన్యాన్ని తీసి మిల్లులో తేమ శాతాన్ని పరిశీలించారు. తేమశాతం సరిగానే ఉండడంతో ధాన్యాన్ని బియ్యంగా మార్చి చూశారు. కొంతమేర ధాన్యం కలర్ మారుతున్నట్లు గ్రహించారు. దీంతో మిల్లర్‌తో మాట్లాడి దిగుమతి చేసుకోవాలని సూచించారు. అందుకు మిల్లర్ అంగీకరించకపోవడంతో ధాన్యం లారీని దుగ్గొండి మండలం చలపర్తిలోని న్యూముబారక్ రైస్ మిల్లుకు పంపించారు. సదరు రైస్ మిల్ యజమాని ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకున్నాడు. బాధిత రైతులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులకు
ఏటీఎంలుగా మారిన కొనుగోలు కేంద్రాలు

బీఆర్ఎస్ నేతల ధ్వజం

మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

ఖానాపురం, మే 11: కాంగ్రెస్ పార్టీ నాయకులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏటీఎంలుగా మార్చుకొని అందినకాడికి దోచుకుతింటున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ఆరోపించారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి వరకు చోటామోట కాంగ్రెస్ నాయకులందరూ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అండతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇటీవల మండలంలో తొమ్మిది కొనుగోలు కేంద్రాలు మంజూరైతే అందులో ఖానాపురం పాకాల రైతుమిత్ర, బుధరావుపేట పద్మావతి ఎఫ్‌బీవో సంఘానికి మాత్రమే అర్హత ఉన్నాయని, మిగిలిన ఏడు కొనుగోలు కేంద్రాలకు ఎలాంటి అర్హత లేదన్నారు. సహకార చట్టానికి తూట్లు పొడిచి అధికారులను బెదిరిస్తూ కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయించుకున్నారని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులను దోచుకోవాలనే కక్కుర్తితో మిల్లర్లతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కమ్మక్కయ్యారని విమర్శించారు. దీంతో కొర్రీలు పెడుతూ బస్తాకు 2 కిలోల నుంచి 5 కిలోల వరకు అదనంగా కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా డీసీవో, కలెక్టర్ స్పందించి అర్హత లేని కొనుగోలు కేంద్రాలను రద్దు చేసి, వారి బారి నుంచి రైతులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌కే మౌలానా, బూస అశోక్, బందారపు శ్రీను, ఆబోత్ అశోక్, రెడ్డి నాగార్జునరెడ్డి, నరేంద్ర పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

నర్సంపేట, మే 11: మండలంలోని గురిజాల జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2002-2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత పాఠశాలకు చేరుకొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా రోజంతా కబుర్లు చెప్పుకొని ఆనందంగా గడిపారు. అనంతరం వారిని విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, బ్రహ్మయ్య, సుదర్శన్, ఆనందం, బాబురావు, విజయలక్ష్మి, రూపమణి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

'అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి'

పోచమ్మమైదాన్, మే 11: అర్హులందరికీ ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటి పాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి, వెంటనే మంజూరు చేయాలని సూచించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, 57 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, బీడీ కార్మికులు లక్షలాది మంది ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని వాపోయారు. అలాగే, మత్స్య, రజక, క్షౌర, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, గొర్రెలపెంపకం తదితర చేతివృత్తుల వారికి ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. పింఛన్లు పెంచుతామని ఇచ్చిన వాగ్దానం ఏడాదిన్నర దాటినా అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

తిలక్‌రోడ్డు శ్మశాన గల్లీలో కమ్ముకున్న చీకట్లు

పోచమ్మమైదాన్, మే 11: వరంగల్ 21వ డివిజన్ కాశీబుగ్గ తిలక్‌రోడ్డు శ్మశాన గల్లీలో వ